సాక్షి
వైఎస్సార్ జిల్లా

సోమవారం । 25 । నవంబర్ । 2024



అంతర్ జోనల్ క్రికెట్ టోర్నీ ప్రారంభం
ఏసీఏ అండర్–23 అంతర్ జోనల్ వన్డే క్రికెట్ మ్యాచ్‌లు ప్రారంభమయ్యాయి. వైఎస్ఆర్ఆర్–ఏసీఏ క్రికెట్ మైదానంలో అనంతపురం, రెస్టాఫ్ సౌత్‌జోన్ జట్లు తలపడ్డాయి. -8లో



ఆందోళనలో అయ్యవార్లు!
రెసిడెన్షియల్ శిక్షణ అంటేనే అయ్యవార్లలో ఒకటే టెన్షన్.. వారి కుటుంబ సభ్యుల్లో ఆందోళన.. అనారోగ్యంతో ఉన్న మినహాయింపు లేదట.. -8లో

గరిష్టం/కనిష్టం
31.5/18.5

వాతావరణం
జిల్లాలో ఆదివారం 18.5 – 31.5 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 1.2 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
-కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

'డయల్ యువర్ కలెక్టర్'ను సద్వినియోగం చేసుకోవాలి

కడప సెవెన్‌రోడ్స్: ప్రతి సోమ వారం ఉదయం 9.30 నుంచి 10.30 గంటల వరకు కొనసాగే డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ శ్రీధర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా ప్రజలు ఈ సమయ మార్పును గమనించి 08562–244437 ల్యాండ్ లైన్ నెంబరుకు ఫోన్ చేసి తమ సమస్యలను విన్నవించుకోవచ్చని పేర్కొన్నారు.

దేవనాగరి హిందీ సేవి సమ్మాన్ పురస్కారానికి ఎంపిక


సర్తాజ్ హుస్సేన్

రాజంపేట టౌన్: రాజంపేట పట్టణానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు ఎస్.సర్తాజ్ హుస్సేన్ దేవనాగరి హిందీ సేవి సమ్మాన్ పురస్కారానికి ఎంపికయ్యారు. ఈవిషయాన్ని ఆదివారం ఆయన ఇక్కడ విలేకరులకు తెలిపారు. రాష్ట్రభాష సేవా సంఘ్ ఫౌండేషన్ ప్రతి ఏడాది దేశంలోని అన్ని రాష్ట్రాల్లో జాతీయ భాష అయిన హిందీ అభివృద్ధికి కృషి చేసే ఉపాధ్యాయులకు ఈ పురస్కారం అందచేస్తుందన్నారు. అందులో భాగంగా ఏడాది ఆంధ్రప్రదేశ్ నుంచి తాను ఎంపికైనట్లు ఆయన తెలిపారు. ఈ ఏడాది డిసెంబర్ 1వ తేదీ హైదరాబాద్‌లో జరిగే కార్యక్రమంలో పురస్కారాన్ని అందుకోబోతున్నట్లు తెలిపారు. సర్తాజ్ హుస్సేన్ పుల్లంపేట మండలం టీ.కమ్మపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాలలో హిందీ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు.

ఘనంగా బిందె సేవ


చౌడేశ్వరిదేవి అమ్మవారిని పల్లకీసేవ నిర్వహిస్తున్న దేవాంగులు

ప్రొద్దుటూరు కల్చరల్: స్థానిక శ్రీచౌడేశ్వరిదేవి జ్యోతి ఉత్సవాలను పురస్కరించుకుని పట్టణంలోని పలు చౌడేశ్వరిదేవి ఆలయాల నిర్వాహకులు ఘనంగా బిందెసేవ నిర్వహించారు. ఆదివారం స్థానిక దేవాంగ పేటలోని జ్యోతినగర్ నుంచి దేవాంగులు, భక్తులు ఊరేగింపుగా శివాలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అమ్మవారిని ఆవాహన చేసిన కలశాలను తల మీద ఉంచుకుని పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. మేదర వీధిలోని రామలింగ చౌడేశ్వరిదేవి ఆలయం నుంచి అమ్మవారి పల్లకీలో ఉంచి ఊరేగింపుగా జ్యోతినగర్‌కు తీసుకొచ్చారు. కార్యక్రమంలో దేవాంగ సంక్షేమ సంఘం అధ్యక్షుడు వుట్టి నాగశయనం, కార్యదర్శి ఈశ్వరయ్య, లక్ష్మీనారాయణ, సాధు గోవిందరాజులు పాల్గొన్నారు.

గిరిజన ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

రాయచోటి టౌన్: గిరిజన ఉద్యోగల సమస్యలు పరిష్కరించాలని ఆల్ ఇండియా ఎస్టీ ఎంప్లాయీస్ అసోషియేషన్ జాతీయ అధ్యక్షుడు, హైకోర్టు న్యాయవాది పీవీ రమణ అన్నారు. ఆదివారం రాయచోటిలోని ఎస్టీ ఎంప్లాయిస్ అసోషియేషన్ 60 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన భవనం అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటిలో నిర్మించాలని కోరారు.

1న ఘనంగా లక్షార్చన మహోత్సవం


లక్షార్చన ఆహ్వాన పత్రాలను ఆవిష్కరిస్తున్న స్వామి అయ్యప్ప సేవా కమిటీ సభ్యులు


ప్రొద్దుటూరు కల్చరల్: పెన్నానది తీరంలోని శ్రీఅయ్యప్పస్వామి ఆలయంలో డిసెంబర్ 1న ఘనంగా లక్షార్చన మహోత్సవం నిర్వహించనున్నట్లు స్వామి అయ్యప్పసేవా సంఘం అధ్యక్షుడు కొవ్వూరు రమేష్‌రెడ్డి తెలిపారు. ఆలయంలో ఆదివారం లక్షార్చనకు సంబంధించిన ఆహ్వాన పత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వామి అయ్యప్ప సేవా సంఘం ఆధ్వర్యంలో దాతలు, భక్తుల సహకారంతో 30 ఏళ్లుగా ఈ వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. లక్షార్చన రోజు స్వామివారికి విశేష అభిషేకాలు, అర్చనలతోపాటు ప్రత్యేక అలంకరణ ఉంటుందన్నారు. మధ్యాహ్నం 30వేల మందికిపైగా భక్తులకు అన్న ప్రసాద వినియోగం చేస్తున్నామన్నారు. డిసెంబర్ 12న అయ్యప్పస్వామి గ్రామోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో టీటీడీ పాలకమండలి మాజీ సభ్యుడు టంగుటూరు మారుతిప్రసాద్, స్వామి అయ్యప్ప సేవా సంఘం గౌరవాధ్యక్షుడు నామా రమేష్ బాబు, ఉపాధ్యక్షుడు రామ్ వెంకటనారాయణ పాల్గొన్నారు.

డబ్బు కట్టు.. పవర్ పట్టు

కరెంట్ టాపిక్
- ముందుగా చెల్లిస్తేనే విద్యుత్ సరఫరా
- స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు శ్రీకారం చుట్టిన విద్యుత్ సంస్థ
- మొదట ప్రభుత్వ కార్యాలయాలకు... ఆ తర్వాత దుకాణాలు,ఇళ్లకు..
- రీచార్జి విధానంలోకి ఏపీఎస్‌పీడీసీఎల్


కడపలోని విద్యుత్‌శాఖ కార్యాలయం (విద్యుత్ భవన్)

కడప కార్పొరేషన్: డిజిటల్ జమానాకు తగ్గట్లుగా ఏపీఎస్‌పీడీసీఎల్ స్మార్ట్‌గా ఆలోచిస్తోంది. ప్రస్తుతం ఉన్న విద్యుత్ మీటర్ల స్థానంలో స్మార్టు మీటర్ల ఏర్పాటుకు రంగం సిద్ధం చేస్తోంది. ఇకపై విద్యుత్ చార్జీల చెల్లింపు విధానం ప్రీ పెయిడ్ పద్ధతిలోకి మారనుంది. మొదట మాన్యువల్ మీటర్ల నుంచి ప్రారంభమైన విద్యుత్ మీటర్లు ఆధునిక పరిజ్ఞానానికి అనుగుణంగా మారుతూ వచ్చాయి. ప్రస్తుతం స్మార్టు మీటర్ల వంతు వచ్చింది. సెల్‌ఫోన్‌కు టాక్‌టైం రీచార్జి చేసుకున్నట్లుగానే ఇకపై విద్యుత్‌ను కూడా ముందుగా డబ్బు చెల్లించి కొనుగోలు చేయాల్సి ఉంటుందన్నమాట. ఈ మేరకు ప్రీపెయిడ్ ఆప్షన్‌తో స్మార్టు మీటర్లను రూపొందించారు. ప్రస్తుతం విద్యుత్ సంస్థ విద్యుత్‌ను కొనుగోలు చేసి వినియోగదారులకు సరఫరా చేస్తుంది. వినియోగదారులు ఈనెలలో వాడిన విద్యుత్ బిల్లును మరుసటి నెలలో చెల్లిస్తూ వస్తున్నారు. బిల్లు ఇచ్చిన 15 రోజుల వరకూ ఎటువంటి అపరాధ రుసుము లేకుండా, ఆ తర్వాత రూ.100 అపరాధ రుసుముతో బిల్లులు చెల్లిస్తున్నారు. ఈ లెక్కన బిల్లు చెల్లించడానికి వినియోగదారులకు దాదాపు నెల వరకూ సమయం ఉంటుంది. ఇప్పటివరకు ఈ పద్ధతిలోనే విద్యుత్ బిల్లుల చెల్లింపు జరిగేది. ఇకపై ఈ విధానం మారనుంది. దశల వారీగా స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఈ మీటర్లలో ప్రీ పెయిడ్ ఆప్షన్ జత చేశారు. దీని ద్వారా విద్యుత్‌సరఫరా కోసం ముందుగానే రీచార్జి చేసుకోవాల్సి ఉంటుంది. అలా చేయకపోతే అర్ధరాత్రైనా.. అపరాత్రైనా ఆటోమేటిక్‌గా విద్యుత్ సరఫరా ఆగిపోతుంది.



ప్రభుత్వ బకాయిలు రూ 857.31 కోట్లు

జిల్లాలో అన్ని ప్రభుత్వ శాఖలు, పంచాయతీలు, పరిశ్రమలు, వ్యాపార, గృహావసర సర్వీసులు కలిపి మొత్తం 8,89,907 సర్వీసులు ఉన్నాయి. వాటిలో ప్రభుత్వ, మున్సిపల్, పంచాయితీ కార్యాలయాల పరంగా ఇప్పటి వరకూ రూ.857.31.కోట్ల బిల్లులు రావాల్సి ఉంది. ఆ బకాయిలను రాబట్టేందుకు ఎన్ని నోటీసులు ఇచ్చినా వసూళ్లు మాత్రం అంతంత మాత్రమేనని ఆ శాఖ అధికారులు చెబుతున్నారు. అన్నీ ప్రభుత్వ శాఖలే కావడంతో విద్యుత్ సరఫరా కట్ చేయలేని పరిస్థితి. దీంతో అవి మొండి బకాయిలుగా తయారయ్యాయి. స్మార్ట్ మీటర్ల ద్వారా ప్రీ పెయిడ్ విధానం అమల్లోకి వస్తే విద్యుత్ శాఖకు బకాయిల బాధ ఉండదు.

ప్రభుత్వ శాఖల విద్యుత్ కనెక్షన్లు
1,18,545

పరిశ్రమల సర్వీసులు: **5308**

వ్యాపార సంస్థలు: **81,779**

గృహ వినియోగ సర్వీసులు
6,71,488

విద్యుత్ శాఖకు ఉన్న మొత్తం బకాయిలు
రూ. **901.52** కోట్లు

అందులో ప్రభుత్వ శాఖల బకాయిలు
రూ. **857.31** కోట్లు

జీతభత్యాలకు కోట్ల ఖర్చు

విద్యుత్ శాఖ పరిధిలో వేల సంఖ్యలో ఉద్యోగులకు జీతాలు, పింఛన్లు చెల్లించడానికి కోట్ల రూపాయలు ఖర్చవుతోంది. శాఖాపరంగా అభివృద్ధి కోసం కోట్లు కావాల్సి. వీటన్నింటికీ మూలాధారం విద్యుత్ బిల్లుల ద్వారా వచ్చే ఆదాయమే. స్మార్టు మీటర్లు పెడితే ఎక్కువ మంది సిబ్బంది అవసరం ఉండదు. ఫలితంగా ఆదాయం పెరిగే అవకాశం ఉంది.

ఉపయోగాలు ఇవీ!
- సెల్ ఫోన్‌లో బ్యాలెన్స్ ఎలా చూసుకుంటామో...అలాగే మనం వాడిన విద్యుత్‌ను, మిగిలి ఉన్న విద్యుత్‌ను యాప్‌లో చెక్ చేసుకోవచ్చు.
- బ్యాలెన్స్ ఉన్నంత వరకే విద్యుత్ సరఫరా ఉంటుంది. నగదు అయిపోయిన వెంటనే సరఫరా బంద్ అవుతుంది. రీచార్జి చేసుకుంటే విద్యుత్ వెలుగులు ఉంటాయి.
- ఎంత విద్యుత్ మిగిలి ఉందో ఎప్పటికప్పుడు చెక్ చేసుకోవడం వల్ల పొదుపుగా కూడా వాడవచ్చు.

నష్టాలు...
- విద్యుత్ సంస్థను నమ్ముకొని ఎన్నో ఏళ్లుగా మీటర్ రీడర్లు పనిచేస్తున్నారు. ఈ విధానం పూర్తి స్థాయిలో అమలైతే వారి ఉపాధికి పెద్ద దెబ్బే పడుతుంది.
- అవగాహన లేమితో రీచార్జి చేసుకోవడంలో వినియోగదారులు ఏమాత్రం అలసత్వం వహించినా సరఫరాకు ఆటంకం ఏర్పడుతుంది.
- ఈ స్మార్టు మీటర్లు వస్తే విద్యుత్ చౌర్యం పెరిగే అవకాశం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. రీచార్జి చేసుకోలేని వారు లైన్ల నుంచి విద్యుత్‌ను అక్రమంగా వాడుకునే అవకాశం ఉంది.

శరవేగంగా స్మార్టు మీటర్ల ఏర్పాటు


స్మార్ట్ మీటరు

జిల్లాలో స్మార్టు మీటర్ల ఏర్పాటు ప్రక్రియ శరవేగంగా సాగుతోంది. ప్రస్తుతం ప్రభుత్వ కార్యాలయాలకు వీటిని బిగిస్తున్నారు. దశల వారీగా పరిశ్రమలు, వాణిజ్య సంస్థలు, గృహ వినియోగ సర్వీసులకు ప్రస్తుతం ఉన్న మీటర్లు మార్చి స్మార్టు మీటర్లు ఏర్పాటు చేస్తారు. వీటికి సిమ్ కార్డుకు రీచార్జి చేసుకున్నట్లుగానే ఎంత విద్యుత్ కావాలో అంత విద్యుత్ ముందుగా డబ్బులు చెల్లించి రీచార్జి చేసుకోవాలి.

మారుతున్న టెక్నాలజీకి అలవాటుపడాలి



పూర్వం మాన్యువల్ మీటర్లు ఉండేవి. కాలానుగుణంగా వివిధ రకాల మీటర్లు అమల్లోకి వచ్చాయి. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఇప్పుడు స్మార్ట్ మీటర్లు వచ్చాయి. దశల వారీగా అన్ని సర్వీసులకు వీటిని అమర్చుతాం. వీటి ద్వారా యూనిట్ల రీడింగ్‌ను ఎప్పటికప్పుడు తెలుసుకోవచ్చు. దీనివల్ల నాణ్యమైన విద్యుత్ సరఫరాను వినియోగదారులు పొందవచ్చు. అదనపు భారం పడే అవకాశం ఉండదు. సోలార్ విద్యుత్ వినియోగదారులు సోలార్ ప్యానెల్స్ ద్వారా సూర్య ఘర్ విద్యుత్ ఉత్పత్తిలో తమకు అవసరమైన విద్యుత్‌ను ఉపయోగించుకొని మిగిలిన విద్యుత్‌ను విద్యుత్ శాఖకు విక్రయించేందుకు వీలుగా ఈ స్మార్టు మీటర్ దోహదపడుతుంది. దీనిలో ప్రీ పెయిడ్ ఆప్షన్ కూడా ఉంటుంది. **– రమణ, పర్యవేక్షక ఇంజనీరు, విద్యుత్‌శాఖ, కడప**

హృదయాలను కలిపే జాతీయభాష ఉర్దూ

- ఎమ్మెల్యే షాజహాన్‌బాషా
- అలరించిన అఖిల భారత ఉర్దూ కవి సమ్మేళనం


జ్యోతిప్రజ్వలన చేసి కవిసమ్మేళనం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మదనపల్లె సిటీ: హృదయాలను కలిపే జాతీయ భాష ఉర్దూ అని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా అన్నారు. స్థానిక బెంగళూరు బస్టాండు వద్దనున్న బడేమకాన్‌లోని హజరత్ ఖాదర్‌షా ఔలియా దర్గా ఉరుసు మహోత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి జరిగిన అఖిల భారత ఉర్దూ కవి సమ్మేళనాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఉర్దూ భాష మాధుర్యాన్ని వివరించారు. ఎందరో ముస్లిమేతరులు ఉర్దూ భాషాభివృద్ధికి కృషి చేశారని గుర్తు చేశారు. ఉర్దూభాషలో నిర్వహించే ముషాయిరాలు (కవి సమ్మేళనాలు) జాతీయ సమైకత్యకు దోహదడతాయన్నారు. ఇందులో భక్తితో కూడిన కవితలతో పాటు సమాజాన్ని మేల్కొలిపే కవితలు, గజల్స్ అందరినీ విశేషంగా ఆకట్టుకుంటాయన్నారు.అనంతరం పలు రాష్ట్రాల నుంచి వచ్చిన ఉర్దూ కవులు తమ కవిత్వంతో అందరినీ అలరించారు. మహా ప్రవక్త హజరత్ మహమ్మద్ జీవితంపై నాత్ కవితా గానం చేశారు. కవులు,ఉర్దూ అకాడమీ నుంచి పురస్కారాలు అందుకున్న మహమ్మద్ షాహిద్, డాక్టర్ మహమ్మద్ నఖీఉల్లాఖాన్, ఇమాం ఖాసిం, కె.సి.కరీముల్లాఖాన్, జాఫరుద్దీన్‌లను దుశ్శాలువ, జ్ఞాపికలతో సత్కరించారు.

- కార్యక్రమంలో టౌన్ బ్యాంకు చైర్మన్ నాదెళ్ల విద్యాసాగర్, దర్గా ముతవల్లి హాషిం, కవి సమ్మేళనం కన్వీనర్ పఠాన్ మహమ్మద్‌ఖాన్, కార్యదర్శి ఖమర్‌అమీని, మదీనా విశ్వవిద్యాలయ అచార్యులు ఇనాయత్‌అమీన్, రూటా నాయకులు ఇస్మాయిల్, సిబాత్ ఉరద్‌రహ్మాన్, నాదిర్‌షావల్లి, షరాఫత్‌అలీఖాన్, పలువురు కవులు పాల్గొన్నారు.

గృహ ప్రవేశానికి వస్తూ తిరిగిరాని లోకాలకు..

రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలు, కుమార్తె మృతి


శ్రీనివాసులరెడ్డి అరుణ పవిత్ర (ఫైల్)


సంఘటనా స్థలం వద్ద గుమికూడిన గ్రామస్తులు

మైదుకూరు/కాశినాయన: బంధువుల నూతన గృహ ప్రవేశ కార్యక్రమంలో పాల్గొనేందుకు బయలుదేరిన ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందారు. ఆదివారం మైదుకూరు మండలం ముదిరెడ్డిపల్లెకు సమీపంలో ఈ సంఘటన జరిగింది. వివరాలిలా ఉన్నాయి. కాశినాయన మండలం చిన్నాయపల్లెకు చెందిన గుర్రాల శ్రీనివాసులరెడ్డి వ్యవసాయం చేస్తుంటారు. ఈయనకు భార్య అరుణ, కుమార్తె పవిత్ర, కుమారుడు జగదీష్‌రెడ్డి ఉన్నారు. జగదీష్‌రెడ్డి ఖాజీపేటలో అవ్వగారి ఇంటి వద్ద ఉంటూ ఎనిమిదో తరగతి చదువుతున్నాడు. ఆదివారం శ్రీనివాసులరెడ్డి భార్య కుమార్తెతో కలిసి ద్విచక్రవాహనంలో మైదుకూరు మున్సిపాలిటీలోని శెట్టివారిపల్లెలో సోమవారం జరిగే తమ బంధువుల గృహ ప్రవేశానికి బయలుదేరారు. ముదిరెడ్డిపల్లెకు సమీపంలో ఎద్దడుగు కనుమ వద్ద వెనుక వైపు నుంచి లారీ బైక్‌ను ఢీకొంది. ఈ సంఘటనలో బైక్‌పై ఉన్న శ్రీనివాసులరెడ్డి, భార్య, కుమార్తె కిందపడిపోయారు. వారిపై నుంచి లారీ వేగంగా దూసుకెళ్లడంతో వారు అక్కడికక్కడే మృతి చెందారు. తల్లిదండ్రులు, చెల్లెలు మృతి చెందడంతో జగదీష్‌రెడ్డి కన్నీరుమున్నీరయ్యారు. చుట్టుపక్కల ఉన్న వారు గట్టిగా కేకలు వేస్తున్నా లారీ ఆపకుండా వెళ్లినట్టు తెలుస్తోంది. శుభకార్యానికి వెళుతూ ఒకే కుటుంబంలోని ముగ్గురు మృతి చెందడంతో చిన్నాయపల్లెలో విషాదఛాయలు అలుముకున్నాయి. సంఘటన స్థలాన్ని మైదుకూరు అర్బన్ సీఐ సయ్యద్ హాసం పరిశీలించి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రొద్దుటూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

'మ్యాథ్ 'బి'కి చక్కటి స్పందన


మ్యాథ్ 'బి'లో పాల్గొన్న విద్యార్థులు

SAKSHI MATH BEE

వైవీయూ: లెక్కలంటే అన్నీ చిక్కులే.. కొందరికిదో బ్రహ్మపదార్థం. అర్థం చేసుకున్న వారికి మాత్రం ఆసక్తికరం. చిన్నవయసులో నేర్చుకునే చిట్కాలు జీవితాంతం గుర్తుండిపోతాయనేది నిపుణుల మాట. విద్యార్థుల్లో గణితం పట్ల ఉన్న భయాన్ని పోగొట్టి.. వారిలో గణితంపై ఆసక్తి పెంచేలా.. చిన్న చిన్న సమస్యలు మొదలు.. వారి స్థాయిని అనుసరించి నిర్వహించిన సాక్షి మ్యాథ్ 'బి' కాంపిటీషన్‌కు విద్యార్థుల నుంచి మంచి స్పందన లభించింది. కడప నగరంలోని జీఎంఆర్ హైస్కూల్‌లో నిర్వహించిన మ్యాథ్ 'బి' క్వార్టర్ ఫైనల్ కాంపిటీషన్ ఆదివారం నిర్వహించారు. కేటగిరీ–1లో 1, 2 తరగతుల విద్యార్థులు, కేటగిరీ–2లో 3,4 తరగతుల విద్యార్థులు, కేటగిరీ–3లో 5, 6,7 తరగతుల విద్యార్థులు ఈ కాంపిటీషన్‌లో పాల్గొన్నారు.

మ్యాథ్స్ అంటే ఎంతో ఇష్టం



నాకు గణితం అంటే ఎంతో ఇష్టం. సాక్షి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మ్యాథ్ 'బి' కాంపిటీషన్‌లో పాల్గొనేందుకు వచ్చాను. ఈ కాంపిటీషన్ ఎంతో బాగుంది. వచ్చే ఏడాది కూడా ఈ కాంపిటీషన్‌లో పాల్గొంటా. – సి.ఎం.వి. బిందుశ్రీ, 5వ తరగతి, జీఎంఆర్ హైస్కూల్, కడప

మ్యాథ్స్ మేడ్ ఈజీ



గణితం అంటే ఎంతో ఇష్టం. గణితాన్ని సులువుగా నేర్చుకునేందుకు ఎప్పుడూ సిద్ధమవుతుంటా. మ్యాథ్స్ కాంపిటీషన్స్ ఎక్కడ ఉన్నా పాల్గొంటా. గణితంపై ఉన్న ఆసక్తే నన్ను కాంపిటీషన్‌లో పాల్గొనేలా చేసింది. – సి. తేజల్, 4వ తరగతి, జీఎంఆర్ హైస్కూల్, కడప

ఉత్సాహంగా స్పెల్'బీ'

- పెద్దసంఖ్యలో హాజరైన విద్యార్థులు
- ఆంగ్లంపై ఆసక్తి పెరుగుతుందంటున్న చిన్నారులు


నాగార్జున మోడల్‌స్కూల్‌లో నిర్వహించిన స్పెల్ బీ కాంపిటీషన్‌లో పాల్గొన్న విద్యార్థులు

SAKSHI SPELL Bee

వైవీయూ : 'సాక్షి మీడియా' ఆధ్వర్యంలో నిర్వహించిన స్పెల్ 'బి'కాంపిటీషన్‌కు విద్యార్థుల నుంచి విశేష స్పందన లభించింది. కడప నగరంలోని నాగార్జున మోడల్ స్కూల్‌లో ఆదివారం నిర్వహించిన స్పెల్ 'బి'కాంపిటీషన్ క్వార్టర్ ఫైనల్ కాంపిటీషన్‌కు అపూర్వ స్పందన లభించింది. ఈ కాంపిటీషన్‌కు నాగార్జున మోడల్ స్కూల్, జీఆర్‌టీ జీవీకే, జీఎంఆర్ విద్యాసంస్థల విద్యార్థులు పెద్దసంఖ్యలో హాజరై తమ ప్రతిభను పరీక్షించుకున్నారు. ఆంగ్లంపై మక్కువ పెంచేలా, ఆసక్తి కలిగించేలా ప్రయత్నం చేస్తున్న 'సాక్షి'కి వారు కృతజ్ఞతలు తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి ప్రారంభమైన ఈ కాంపిటీషన్ మధ్యాహ్నం వరకు కొనసాగింది. ఆంగ్లంపై ఉన్న భయాన్ని పోగొట్టేలా.. భాషపై పట్టు సాధించేలా కాంపిటీషన్ ఉందంటూ విద్యార్థులు పేర్కొన్నారు. కాగా స్పెల్ 'బి' క్వార్టర్ ఫైనల్ కాంపిటీషన్‌లో కేటగిరీ–1లో 1,2 తరగతుల విద్యార్థులు, కేటగిరీ–2లో 3, 4 తరగతుల విద్యార్థులు, కేటగిరీ–3లో 5,6,7 తరగతుల విద్యార్థులు, కేటగిరీ–4లో 8,9,10 తరగతుల విద్యార్థులు పాల్గొన్నారు.

ఇంగ్లిష్ అంటే ఆసక్తి పెరిగింది..



స్పెల్ బి కాంపిటీషన్‌లో పాల్గొనడం వల్ల ఇంగ్లీషుపై ఆసక్తి పెరిగింది. ఇందుకోసం కొత్త పదాలను నేర్చుకున్నాను. ఈ స్పెల్లింగ్స్ నేర్చుకోవడం నాకు అకడమిక్‌గా కూడా ఉపయోగకరం. – ఎ. మోక్షిత, 6వ తరగతి, జీఎంఆర్ హైస్కూల్, కడప

కాంపిటీషన్ పరీక్షలకు ఉపయుక్తంగా ఉంటుందని..



సాక్షి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్పెల్'బి'కాంపిటీషన్స్‌లో పాల్గొంటున్నా. కాంపిటీటివ్ పరీక్షలకు ఇది పునాదిగా భావిస్తున్నా. మెటీరియల్‌ను బాగా సాధన చేశా. ఫైనల్ వరకు వెళ్లాలన్నదే లక్ష్యం. –ఎస్. షాహీన్, 7వ తరగతి, జీఆర్‌టీ జీవీకే స్కూల్, కడప

పోటీతత్వం పెరుగుతుంది



స్పెల్ 'బి'వంటి కాంపిటీటివ్ పరీక్షలకు హాజరుకావడం ద్వారా పోటీ తెలుస్తుంది. మనం ఏస్థాయిలో ఉన్నామో అర్థమవుతుంది. మన ప్రతిభను అంచనా వేసుకునేందుకు ఇటువంటి కాంపిటీషన్స్ ఉపయోగపడతాయి. – సి. భవిత, 5వ తరగతి, నాగార్జున మోడల్ స్కూల్, కడప

క్లుప్తంగా

కమనీయంగా కల్యాణోత్సవం



రామేశ్వరంలో కల్యాణోత్సవంలో భద్రావతి, భావన్నారాయణ స్వామి

ప్రొద్దుటూరు కల్చరల్‌ : స్థానిక రామేశ్వరంలోని భద్రావతి భావన్నారాయణ స్వామి ఆలయంలో పద్మశాలీయ బహుత్తమ సంఘం ఆధ్వర్యంలో స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. ఉదయం మహాశివునికి, భద్రావతి, భావన్నారాయణ స్వామికి, శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వరస్వామికి విశేష అభిషేకాలు, అర్చనలు చేశారు. అనంతరం భద్రావతి, భావన్నారాయణ స్వామి ఉత్సవ మూర్తులకు ప్రత్యేకంగా అలంకరించి సుముహూర్తంలో కల్యాణోత్సవాన్ని మంగళ వాయిద్యాల మధ్య వైభవంగా నిర్వహించారు. కల్యాణోత్సవం అనంతరం భక్తులకు అన్నప్రసాద వినియోగం జరిగింది. అలాగే దొరసానిపల్లె రోడ్డు శ్రీరామ్‌ నగర్‌లోని భద్రావతి భావన్నారాయణ స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు.

నగరేశ్వరస్వామికి ఘనంగా రుద్రాభిషేకం



శివలింగానికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహిస్తున్న వేద పండితులు

ప్రొద్దుటూరు కల్చరల్‌ : స్థానిక ఎర్రగుంట్ల రోడ్డులోని శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి ఉద్యానవనంలో ఆదివారం రాత్రి ఆర్యవైశ్యసభ ఆధ్వర్యంలో కార్తీక మాసం సందర్భంగా నగరేశ్వరస్వామికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం ఘనంగా నిర్వహించారు. సాయంత్రం ఉద్యానవనంలో నగరేశ్వరస్వామి, పార్వతీదేవి ఉత్సవ మూర్తులకు ప్రత్యేక పూజలు చేశారు. 102 మంది ఆర్యవైశ్య సుహాసినులు పాల్గొని స్వామి, అమ్మవారికి పసుపు, కుంకుమ, దీపాలు, నైవేద్యంతో అర్చించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్యసభ అధ్యక్షుడు బుశెట్టి రామమోహన్‌రావు, కార్యదర్శి నాగేశ్వరరావు, ఆర్యవైశ్యసభ ప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.

ఆగని శిక్షణలు.. ఆందోళనలో అయ్యవార్లు!

- నేటి నుంచి మూడో విడత రెసిడెన్షియల్‌ శిక్షణలు
- అయ్యవార్లు వద్దంటున్నా పట్టించుకోని ప్రభుత్వం
- ఈనెల 6న శిక్షణలో మరణించిన ఉపాధ్యాయుడు
- ప్రాణాలు పోతున్నా మొండిపట్టు వీడని సర్కారు

సాక్షి ప్రతినిధి, కడప : రెసిడెన్షియల్‌ శిక్షణ అంటేనే అయ్యవార్లలో ఒకటే టెన్షన్‌.. వారి కుటుంబ సభ్యుల్లో అంతులేని ఆందోళన.. వృద్ధులు, చిన్నపిల్లల తల్లులు, అనారోగ్యంతో ఉన్నవారు.. వీరెవ్వరినీ మినహాయింపు ఇవ్వకుండా సోమవారం నుంచి శనివారం దాకా ఆరు రోజులపాటు రాత్రింబవళ్లు శిక్షణలోనే గడపాలి. ఒక్క ఉపాధ్యాయుడు కూడా ఈ తరహా శిక్షణను కోరుకోనప్పటికీ.. రెసిడెన్షియల్‌ పద్ధతిలో శిక్షణ వద్దని ఉపాధ్యాయ సంఘాలు నెత్తీనోరూ కొట్టుకున్నా మొత్తుకుంటున్నప్పటికీ సర్కారు మాత్రం తాను అనుకున్న దిశగానే మొండిగా ముందుకెళుతోంది. ఈ నెల 6వ తేదీన ఓ ఉపాధ్యాయుడు శిక్షణలోనే కన్నుమూసినా.. సర్కారు మొండివైఖరిలో ఇసుమంతైనా మార్పు రాలేదు. శిక్షణలను కొనసాగిస్తూనే ఉంది. ఈ సంఘటన మరవకపోగానే తిరిగి ఈనెల 26 వ తేదీనుంచి శిక్షణలను మొదలెడుతున్నారు. ఇంతెంతమందిని బలి తీసుకున్న తర్వాత ఇలాంటి బలవంతపు శిక్షణలకు పుల్‌స్టాప్‌ పెడతారో అంటూ అయ్యవార్లు నిస్సహాయ స్థితిలో నిట్టూర్పులు విడుస్తున్నారు.

విద్యా సంవత్సరం మధ్యలో శిక్షణలు అవసరమా..?

విద్యా సంవత్సరం ప్రారంభమై ఇప్పటికే ఐదు నెలలు దాటిపోయింది. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పుడు తీరిగ్గా ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులకు ఫౌండేషనల్‌ లిటరసీ న్యూమరసీ అనే అంశంపై, అలాగే ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు లీడర్‌షిప్‌ ప్రోగ్రాం పేరుతో రెసిడెన్షియల్‌ శిక్షణలను మొదలెట్టింది. రెండు మూడు జిల్లాలకు కలిపి ఓచోట శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేశారు. కడప, అన్నమయ్య జిల్లాల ఉపాధ్యాయులకు కడప గ్లోబల్‌ ఇంజినీరింగ్‌ కళాశాలలో.. కడప, కర్నూల్‌, అనంతపురం జిల్లాల ప్రధానోపాధ్యాయులకు అనంతపురంలో శిక్షణలను కొనసాగిస్తున్నారు. ఇప్పటికే రెండు విడతల శిక్షణలను పూర్తి చేసిన ప్రభుత్వం తాజాగా ఈనెల 26 నుంచి జరగబోయే మూడో విడత శిక్షణకు హాజరు కావాలంటూ ఆదివారం సంబంధిత అయ్యవార్లకు మెసేజ్‌లు పంపారు. తొలిరోజు ఉదయం 8 గంటలకే శిక్షణా కేంద్రానికి చేరుకోవాలంటూ అందులో పేర్కొన్నారు. వాస్తవానికి ఉపాధ్యాయులకు ఇవ్వాల్సిన వృత్యంతర శిక్షణలను వేసవి సెలవుల్లో ఏర్పాటు చేయాలి. విద్యా సంవత్సరం మధ్యలో ఇలాంటి శిక్షణలు ఏర్పాటు చేసి వారాలపాటు ఉపాధ్యాయులను పాఠశాలలకు దూరం చేయడం సమంజసం కాదని మేధావులు



ఈనెల 6 వ తేదీ రాత్రి కడప శిక్షణా కేంద్రంలో నిరసన వ్యక్తం చేస్తున్న ఉపాధ్యాయులు (ఫైల్‌)

అభిప్రాయ పడుతున్నారు.

ప్రెండ్లీ ప్రభుత్వం అంటూనే నిరంకుశ ధోరణి..

తమది ఫ్రెండ్లీ ప్రభుత్వమని ఓవైపు ఊదరగొడుతూనే మరోవైపు లక్షలాదిమంది ఉపాధ్యాయుల ఆకాంక్షలకు వ్యతిరేకంగా రెసిడెన్షియల్‌ శిక్షణలను కూటమి ప్రభుత్వం కొనసాగిస్తోంది. ఉపాధ్యాయ సంఘాలు, ఎన్జీవోస్‌ విద్యాశాఖ ఉన్నతాధికారులకు వినతి పత్రాలు సమర్పించినప్పటికీ ప్రభుత్వపు మొండి వైఖరిలో ఎలాంటి మార్పు రాలేదు. శిక్షణలకు తాము వ్యతిరేకం కాదని, కేవలం రెసిడెన్షియల్‌ శిక్షణలను మాత్రమే వద్దంటున్నామని విన్నవించుకుంటున్నా వారి విజ్ఞప్తుల సర్కారు చెవికెక్కలేదు. శిక్షణలో పాల్గొన్న ఉపాధ్యాయులు సాయంత్రానికి ఇంటికి చేరుకునేటట్లు నాన్‌ రెసిడెన్షియల్‌ పద్ధతిలో మండల, తాలూకా కేంద్రాల్లో ఏర్పాటు చేయమని వారు కోరుతున్నా ప్రభుత్వం అవేవీ పట్టించుకోకుండా మొండిగా ముందుకెళ్తోంది. కనీసం చిన్నపిల్లల తల్లులు, అనారోగ్యంతో ఉన్నవారికి సైతం ఈ శిక్షణలో మినహాయింపు ఇవ్వకపోవడం వారి పాషాణ హృదయానికి పరాకాష్టగా మారిందని ఉపాధ్యాయులు వాపోతున్నారు.

ఈనెల 6న ఓ నిండుప్రాణం బలి..

రెసిడెన్షియల్‌ శిక్షణకు హాజరైన ఓ ఉపాధ్యాయుడు ఈనెల 6వ తేదీ తెల్లవారుజామున అసువులు బాశాడు. ఏలూరు జిల్లా అగిరిపల్లి శిక్షణా కేంద్రంలోనే రత్నకుమార్‌ అనే ప్రధానోపాధ్యాయుడు గుండెపోటుతో మృతి చెందడం ఉపాధ్యాయ వర్గాలను తీవ్రంగా కలిచివేసింది. నిరసన వ్యక్తం అవుతుందన్న తరుణంలో అప్పటికప్పుడు శిక్షణ తరగతులను తాత్కాలికంగా వాయిదా వేసి... కొన్నాళ్ల తర్వాత తిరిగి అదే పద్ధతిలో శిక్షణలను కొనసాగిస్తూ ప్రభుత్వం తమ నియంతృత్వపు ధోరణిని ప్రదర్శించడం ఉపాధ్యాయుల్లో ఆవేదనను రగిలిస్తోంది. ఓ నిండుప్రాణం బలైనా సర్కారు కళ్లు తెరవకపోతే ఎలా అంటూ అయ్యవార్లు వాట్సాప్‌ గ్రూపుల్లో తమ ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తున్నారు. అయితే వినతిపత్రాలు, వాట్సాప్‌ నిరసనలు ఈ ప్రభుత్వాన్ని ఇసుమంతైనా కదిలించలేవని, ఆందోళన ఉధృతం చేస్తేనే ప్రయోజనం ఉంటుందని మరికొంతమంది అదే వాట్సాప్‌ గ్రూపుల్లో ఉద్బోధిస్తున్నారు. అయితే అయ్యవార్ల సహనాన్ని వారి బలహీనతగా భావించిన చంద్రబాబు సర్కారు.. లక్షల మంది ఉపాధ్యాయుల ఆకాంక్షలకు వ్యతిరేకంగా రెసిడెన్షియల్‌ పద్ధతిలోనే బలవంతపు శిక్షణలను కొనసాగిస్తుండటం పై విశ్లేషకులు సైతం విచారం వ్యక్తం చేస్తున్నారు.

జూదరుల అరెస్టు

రూ.1,84,760 స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రాజేంద్రప్రసాద్‌

అట్లూరు : లంకమల్లేశ్వర అభయారణ్యం పరిధిలోని రామలింగేశ్వర ఆలయం దగ్గర ఆదివారం తెల్లవారు జామున మంగళాయ అడుతున్న 20 మంది జూదరులను అరెస్టు చేసి వారివద్ద నుంచి రూ.1,84,760లు నగదు, 20 సెల్‌ఫోన్లు, ఒక ఐషర్‌ అర్టిగ వాహనంతో పాటు 6 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు మైదుకూరు డీఎస్పీ రాజేంద్రప్రసాద్‌ తెలిపారు. పట్టుబడిన వారిలో బద్వేలు మండలం సిద్ధుగారిపల్లికి చెందిన ఇద్దరు నంద్యాల జిల్లా నంద్యాల పట్టణానికి చెందిన 18 మంది ఉన్నారన్నారు. ముందస్తు సమాచారంతో దాడి చక్కగా పట్టుకున్న సిబ్బందిని ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో బద్వేలు రూరల్‌ సీఐ నాగభూషణం, అట్లూరు ఎస్‌ఐ రామకృష్ణ, గోపవరం ఎస్‌ఐ శ్రీకాంత్‌, హెడ్‌ కానిస్టేబుళ్లు భాస్కర్‌, మృత్యుంజయ, చంద్రశేఖర్‌రెడ్డి, కానిస్టేబుళ్లు శేఖర్‌, సుబ్బయ్య, శ్రీనివాసులు, చంద్ర, చంద్రశేఖర్‌, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులను ప్రోత్సహించేందుకే పోటీలు



హాజరైన క్రీడాకారులతో అతిథులు

కడప స్పోర్ట్స్‌ : క్రీడాకారులను ప్రోత్సహించడమే ఈషా ఫౌండేషన్‌ లక్ష్యమని మానవత సర్వం దోసేవా సంస్థ డైరెక్టర్‌ రామాంజనేయులరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం కడప నగరంలోని డీఎస్‌ఏ క్రీడామైదానంలో ఈషా ఫౌండేషన్‌ ఆధ్వర్యంలో వాలీబాల్‌ క్రీడాపోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సద్గురు ప్రారంభించిన ఈషా గ్రామోత్సవం, గ్రామీణ భారతదేశ స్ఫూర్తిని పునరుజ్జీవింప చేయడానికి ఎంతో కృషి చేస్తోందన్నారు. గౌరవ అతిథిగా విచ్చేసిన వైరెడ్డి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ ఆందరిలో ఆధ్యాత్మిక భావాలను నింపే ఈషా ఫౌండేషన్‌ క్రీడాపోటీలను నిర్వహించడం అభినందనీయమన్నారు. అన్నమయ్య జిల్లా డీఎస్‌డీఓ గోసెబాషా మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 26 జిల్లాల్లో క్రీడాపోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నవంబర్‌ 16 నుంచి డిసెంబర్‌ 28వ తేదీ వరకు జిల్లాస్థాయి, రాష్ట్రస్థాయి, దక్షిణభారత స్థాయి పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తుది విజేతలకు డిసెంబర్‌ 28న కోయంబత్తూరులోని ఆదియోగి వద్ద బహుమతులు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. అంతకుముందు చిన్నారి కీర్తి చేసిన నృత్యప్రదర్శన ఆకట్టుకుంది. అనంతరం విజేతలకు నగదు బహుమతులు, ట్రోఫీ బహూకరించారు. కార్యక్రమంలో ప్రముఖ న్యూరో వైద్యులు డాక్టర్‌ జగదీశ్వర్‌రెడ్డి, ఈషా ఫౌండేషన్‌ ప్రాంతీయ సమన్వయకర్త మోహన్‌రెడ్డి, డీఎస్‌ఏ వాలీబాల్‌ శిక్షకుడు శ్రీనివాసరాజు, ఈషా ఫౌండేషన్‌ వలంటీర్లు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

కడప అర్బన్‌ : కడప నగరం తాలూకా పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో నబీకోటలో వాడేశ్వరి దేవాలయం సమీపంలో నివాసం ఉంటున్న రాజశేఖర్‌ (29) అనే వ్యక్తి తన భార్య అనితతో గొడవపడుతుండేవాడు. వల్లూరు మండలం గోటూరుకు చెందిన రాజశేఖర్‌కు అనితకు ఏడాదిన్నర క్రితం వివాహమైంది. వీరికి నాలుగు నెలల పాప సంతానంగా ఉంది. ఈ క్రమంలో ఇంటిలో ఆదివారం ఉదయం భార్యాభర్తలిద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. కొంతసేపటికి తన చంటిబిడ్డను తీసుకుని అనిత అక్కడి నుంచి వెళ్లిపోయింది. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన రాజశేఖర్‌ ఇంటిలో ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రాజశేఖర్‌ మృతదేహాన్ని రిమ్స్‌కు పోస్టుమార్టం కోసం తరలించారు. రాజశేఖర్‌ సోదరుడు నారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కడప తాలూకా ఎస్‌ఐ తాహీర్‌హుస్సేన్‌ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఉత్సాహంగా చదరంగం పోటీలు



విజేతలకు ట్రోఫీ, నగదు పురస్కారం అందజేస్తున్న చెస్‌ అసోసియేషన్‌ ప్రతినిధులు

కడప స్పోర్ట్స్‌ : కడప నగరం బెల్లంమండీవీధిలోని ఓ ప్రైవేట్‌ ఫంక్షన్‌ హాల్‌లో నిర్వహించిన ఆంధ్రప్రదేశ్‌ ఓపెన్‌ ప్రైజ్‌మనీ చదరంగం పోటీలు ఉత్సాహంగా సాగాయి. ఈ పోటీలను ఏపీ చెస్‌ అసోసియేషన్‌ ప్రధాన కార్యదర్శి వి. సత్యనారాయణ, వైఎస్సార్‌ జిల్లా చదరంగం అసోసియేషన్‌ కార్యదర్శి బి. అనీస్‌ దర్బార్‌ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు రూ.53 వేలు నగదు ప్రోత్సాహక బహుమతులు అందజేయడం అభినందనీయమన్నారు. అనంతరం విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు నగదు బహుమతులు, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఫిడే ఆర్బిటర్‌ గోపీనాథ్‌, అసిస్టెంట్‌ ఆర్బిటర్‌ శ్రీకాంత్‌, క్రీడాకారులు పాల్గొన్నారు.

విజేతలుగా అప్పలసుబ్బనాయుడు-మల్లేశ్వరరావు

ఏపీ ఓపెన్‌ ప్రైజ్‌మనీ చెస్‌ ఛాంపియన్‌గా కడప నగరానికి చెందిన ఎస్‌. అప్పలసుబ్బారావు, విజయవాడకు చెందిన కె. మల్లేశ్వరరావులు నిలిచారు. మూడో స్థానంలో అనంతపురానికి చెందిన మేకల నాగేంద్ర, 4వ స్థానంలో కడప నగరానికి చెందిన రూపేష్‌రెడ్డి నిలిచారు. మొదటి 30 స్థానాల్లో నిలిచిన క్రీడాకారులకు నగదు ప్రోత్సాహకం, సర్టిఫికెట్లు అందజేశారు.

పాఠశాలల సమయాన్ని పెంచడం సరికాదు



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీటీఎఫ్‌ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్యాంసుందర్‌రెడ్డి

కడప ఎడ్యుకేషన్‌ : రాష్ట్రంలో ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాలల సమయాన్ని పెంపుదల చేయడం సరి కాదని ఏపీటీఎఫ్‌ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎ.శ్యాంసుందర్‌ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం కడపలోని ఏపీటీఎఫ్‌ కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పైలెట్‌ ప్రాజెక్ట్‌ కింద ప్రతి జిల్లాలో మండలానికి ఒక ఉన్నత పాఠశాలను ఎంపిక చేసి ఆ పాఠశాల సమయాన్ని 9 గంటల నుంచి 5 గంటల వరకు నిర్వహించాలని ఉత్తర్వులు ఇవ్వడం సరైన విధానం కాదన్నారు. ప్రస్తుతం ఉన్న సమయం 9 గంటల నుంచి 4 గంటల వరకు బాగుందన్నారు. సాయంత్రం ఐదు గంటల తర్వాత గ్రామీణ ప్రాంతాలకు వెళ్లేందుకు రవాణా సౌకర్యాలు సరిగ్గా ఉండవన్నారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఖాదర్‌ బాషా, శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర కౌన్సిలర్‌ భాస్కర్‌రెడ్డి, జిల్లా కౌన్సిలర్లు నరసింహులు, రాజారావు తదితరులు పాల్గొన్నారు.

అంతర్‌ జోనల్‌ క్రికెట్‌ టోర్నీ ప్రారంభం

కడప స్పోర్ట్స్‌ : కడప వేదికగా ఏసీఏ అండర్‌-23 అంతర్‌ జోనల్‌ వన్డే క్రికెట్‌ మ్యాచ్‌లు ఆదివారం ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. కడప నగరంలోని వైఎస్సార్‌-ఏసీఏ క్రికెట్‌ మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో అనంతపురం, రెస్టాఫ్‌ సౌత్‌జోన్‌ జట్లు తలపడ్డాయి. టాస్‌ గెలిచిన అనంతపురం జట్టు బ్యాటింగ్‌ ఎంచుకుంది. 49.2 ఓవర్లలో 216 పరుగుల వద్ద అనంత జట్టు ఆలౌట్‌ అయింది. జట్టులోని టి. మహేంద్రారెడ్డి 95 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. దత్తారెడ్డి 37 పరుగులు చేశాడు. రెస్టాఫ్‌ సౌత్‌జోన్‌ బౌలర్లు సాకేత్‌రామ్‌ 3, హృజిప్‌సాత్విక్‌ 2 వికెట్లు తీశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన రెస్టాఫ్‌ సౌత్‌జోన్‌ జట్టు 46.5 ఓవర్లలో 7 వికెట్లు నష్టానికి 217 పరుగులు చేసి విజయం సాధించింది. జట్టులోని పి. సుబ్రమణ్యం 73, శశాంక్‌ శ్రీవాత్సవ్‌ 52 పరుగులు చేశారు. అనంత బౌలర్లు దత్తారెడ్డి 3, ప్రదీప్‌ 2, ప్రవీణ్‌ 2 వికెట్లు తీశారు. కాగా రెస్టాఫ్‌ సౌత్‌జోన్‌ జట్టు 3 వికెట్ల తేడాతో విజయం సాధించింది.

కేఎస్‌ఆర్‌ఎం మైదానంలో..

కేఎస్‌ఆర్‌ఎం మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో ప్రకాశం, రెస్టాఫ్‌ సెంట్రల్‌ జోన్‌ జట్లు తలపడ్డాయి. టాస్‌ గెలిచిన ప్రకాశం జట్టు బ్యాటింగ్‌ ఎంచుకుంది. 46.5 ఓవర్లలో 224 పరుగుల వద్ద ఆలౌట్‌ అయింది. జట్టులోని అభినవ్‌ 83, లోకేష్‌రెడ్డి 33 పరుగులు చేశారు. రెస్టాఫ్‌ సెంట్రల్‌ జోన్‌ బౌలర్లు సూరాంత్‌ నాయుడు 3, సుమిత్రన్‌ 2 వికెట్లు తీశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన రెస్టాఫ్‌ సెంట్రల్‌ జోన్‌ జట్టు 42.2 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 225 పరుగులు చేసింది. జట్టులోని భాజామైనుద్దీన్‌ 72 పరుగులు, సుమిత్రన్‌ 57 పరుగులు చేశారు. ప్రకాశం బౌలర్‌ పవన్‌ 3 వికెట్లు తీశాడు. కాగా సెంట్రల్‌ జోన్‌ జట్టు 4 వికెట్ల తేడాతో విజయం సాధించింది.

కేఓఆర్‌ఎం మైదానంలో..

కేఓఆర్‌ఎం మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో తూర్పుగోదావరి, రెస్టాఫ్‌ నార్త్‌జోన్‌ జట్లు తలపడ్డాయి. టాస్‌ గెలిచిన రెస్టాఫ్‌ నార్త్‌జోన్‌ జట్టు బ్యాటింగ్‌ ఎంచుకుంది. 38.5 ఓవర్లలో 164 పరుగుల వద్ద ఆలౌట్‌ అయింది. జట్టులోని సాయిపూర్ణతేజ 62, హర్షవర్ధన్‌ 47 పరుగులు చేశారు. తూర్పుగోదావరి బౌలర్లు వంశీనారాయణ 4, సందీప్‌ 2, శివమూర్తి 2 వికెట్లు తీశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన తూర్పుగోదావరి జట్టు 44.1 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 165 పరుగులు చేసింది. జట్టులోని సూర్యదెజ్జన్య 43 పరుగులు, విజయ్‌ 41 పరుగులు చేశారు. దీంతో తూర్పుగోదావరి జట్టు 6 వికెట్ల తేడాతో విజయం సాధించింది.



95 పరుగులు చేసిన బ్యాట్స్‌మన్‌ మహేంద్రారెడ్డి



73 పరుగులు రెస్టాఫ్‌ సౌత్‌జోన్‌ బ్యాట్స్‌మన్‌ సుబ్రమణ్యం



83 పరుగులు చేసిన ప్రకాశం బ్యాట్స్‌మన్‌ అభినవ్‌

కనుల పండువగా శివభక్తేంద్రుని వార్షికోత్సవం



ఆలయంలో కోలాటం ప్రదర్శన చేస్తున్న కళాకారులు

ఖాజీపేట : కొరిన కొర్మలు తీర్చే దైవంగా పిలువబడే శివభక్తేంద్రుని 30వ వార్షికోత్సవ వేడుకలు ఆదివారం కనుల పండువగా జరిగింది. పెద్ద ఎత్తున భక్తులు స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రత్యేక హోమం తోపాటు ఆలయంలోని అయ్యప్ప, అభయాంజనేయులు, లక్ష్మీదేవి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం శివభక్తేంద్రుని అభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా కోలాటం ప్రదర్శన ఆకట్టుకుంది.

ఎస్సీ ఎస్టీ చట్టం దుర్వినియోగం తగదు



మాట్లాడుతున్న భూశిపాటి కిశోర్‌

కడప రూరల్‌ : సోషల్‌ మీడియా పోస్టులపై నమోదవుతున్న కేసుల్లో ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులు వాడుకోవడం శోచనీయమని దళితపోరాట నేత భూశిపాటి కిశోర్‌ అన్నారు. ఆదివారం కడప నగరంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. సోషల్‌మీడియా కార్యకర్తలపై నమోదవుతున్న కేసులకు, కేసులు పెడుతున్న దళితులకు ఏం సంబంధమని ప్రశ్నించారు. ఎంతో సమున్నత లక్ష్యంతో తీసుకు వచ్చిన ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ చట్టం రాజకీయ నాయకుల తప్పుడు విధానాలతో ఇప్పటికే నిర్వీర్యమైందని ఆందోళన వ్యక్తం చేశారు. ఎస్సీ వర్గాల్లో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చిచ్చురేపారన్నారు. ఆయన రాజకీయ లబ్దికోసం సోషల్‌ మీడియా కార్యకర్తలపై కేసులు నమోదు చేయడానికి ఎస్సీలను వాడుకోవడం దారుణమన్నారు. ఎస్సీలు ఎవరూ రాజకీయ ఉచ్చులో పడొద్దని, రాజకీయ నేతలు ఎస్సీ ప్రలోభాలు పెట్టినా వాస్తవాలు గ్రహించాలన్నారు. కార్యక్రమంలో ఆలిండియా అంబేడ్కర్‌ సేన ఏపీ రాష్ట్ర కార్యనిర్వాహక సభ్యుడు పి.పెంచలయ్య పాల్గొన్నారు.

ఎస్సీ,ఎస్టీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి



డాక్టర్‌ భూమిరెడ్డి వసంతకుమార్‌

దువ్వూరు : ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని దువ్వూరు ఉపాధి హామీ పథకం ఏపీఓ డాక్టర్‌ భూమిరెడ్డి వసంతకుమార్‌ తెలిపారు. ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులకు సంబంధించిన సమస్యల పరిష్కారం కోసం సేవం పేరుతో ఏర్పాటైన సంఘానికి తాను జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైనట్లు తెలిపారు. మైదుకూరులో ఆదివారం జరిగిన జిల్లా కమిటీ సమావేశంలో ఉపాధ్యక్షులుగా సుధాకర్‌, జయచంద్రబాబు, కార్యదర్శిగా ప్రసాద్‌, సంయుక్త కార్యదర్శిగా అన్నానాయక్‌, కోశాధికారిగా చంద్రశేఖర్‌, ఓబులేసుతోపాటు 27 మంది సభ్యులను ఎన్నుకున్నట్లు ఆయన పేర్కొన్నారు.

పాత కక్షలతో వ్యక్తి హత్య



హత్యకు గురైన వీరనారాయణ యాదవ్‌

మైదుకూరు : తన కుటుంబానికి చెందిన మహిళ పట్ల అసభ్యంగా ప్రవర్తించాడనే కోపంతో మైదుకూరు మండలంలోని చెర్లోపల్లె గ్రామానికి చెందిన చింతకుంట వీరనారాయణ యాదవ్‌ (43) అనే వ్యక్తిని అదే గ్రామానికి చెందిన అతని దాయాది హత్య చేశాడు. మైదుకూరు అర్బన్‌ పోలీసులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కొద్ది రోజుల క్రితం మృతుడు వీరనారాయణ యాదవ్‌, సుబ్బరాజు మరదలి చేయిపట్టుకొని అసభ్యంగా ప్రవర్తించాడు. ఆమె భర్త బాలకృష్ణ బతుకుతెరువు కోసం గల్ఫ్‌ దేశానికి వెళ్లాడు. ఇంటిలో ఒంటరిగా ఉంటున్న తన మరదలి పట్ల అసభ్యంగా ప్రవర్తించిన వీరనారాయణపై సుబ్బరాజు కక్ష పెంచుకున్నాడు. శనివారం రాత్రి వీరనారాయణ కొందరు మనుషులను పిలుచుకొని మైదుకూరు మున్సిపాలిటీలోని కృష్ణాపురం సమీపంలో భూమిరెడ్డి చిన్నయ్యగారి వెంకటయ్య అనే రైతు పొలంలోని ఉల్లికాడలను గొనెల కోసం తెచ్చుకునేందుకు ట్రాక్టర్‌ తీసుకుని వెళ్లాడు. అదే అదనుగా భావించి సుబ్బరాజు ఉల్లిపొలానికి సమీపంలో ఆటలి తోటలో కాపు కాసి ట్రాక్టర్‌లో ఉల్లికాడలను లోడ్‌ చేస్తున్న వీరనారాయణను కాలి పిక్కపై గొడలితో నరికాడు. అక్కడున్న వారు కేకలు వేయడంతో సుబ్బరాజు పారిపోయాడు. వారు చికిత్స కోసం వీరనారాయణను మైదుకూరు ప్రభుత్వాస్పత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు చెప్పారు. అర్బన్‌ సీఐ సయ్యద్‌ హాసం సంఘటన స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోస్టు మార్టం కోసం ప్రొద్దుటూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గురువులకు గుదిబండగా మారిన బోధనేతర పనులు



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు రఘునాథరెడ్డి

కడప ఎడ్యుకేషన్‌ : ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే గురువులకు బోధనేతర పనులు గుదిబండలుగా మారాయని ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు రఘునాథరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం కడపలోని నాగార్జున మహిళా డిగ్రీ కళాశాలలో ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఎస్‌.ఎం.డి.ఇలియాస్‌ బాషా అధ్యక్షతన 78వ జిల్లా వార్షిక కౌన్సిల్‌ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ బడిలో అడుగు పెట్టినప్పటి నుంచి యాప్‌లతోనే సరిపోతుందని ఇక పాఠాలు ఎప్పుడు బోధించాలన్నారు. మార్కుల ఆన్‌ లోడింగ్‌, అపార్‌ లాంటి కార్యక్రమాల కారణంగా ఉపాధ్యాయులు తీవ్ర ఒత్తిడికి, ఆందోళనలకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఉపాధ్యాయులను యాప్‌ల నుంచి విముక్తి కలిగించాలన్నారు. రాష్ట్ర అసోసియేట్‌ అధ్యక్షుడు కె.సురేష్‌ బాబు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సీపీఎస్‌ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి.రమణారెడ్డి, పి.శివశంకర్‌, కె.బాలగంగిరెడ్డి, పి.సుబ్బరామ్‌ కిరణ్‌, బి.సుదర్శన్‌ రెడ్డి, జిల్లా పరిశీలకుడు పి.హరిప్రసాదరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి సంగమేశ్వరరెడ్డి, జిల్లా ఆర్థిక కార్యదర్శి జి.రామ్మోహన్‌, జిల్లా సహాధ్యక్షులు యు.జయరామయ్య, టి.వి.రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు లెక్చరర్లను రెగ్యులర్‌ చేయాలి



జేఏసీగా ఏర్పాటైన ప్రభుత్వ జూనియర్‌ కళాశాలల కాంట్రాక్టు జూనియర్‌ లెక్చరర్లు

కడప ఎడ్యుకేషన్‌ : ఉమ్మడి కడప జిల్లాలోని ప్రభుత్వ జూనియర్‌ కళాశాలల్లో పని చేస్తున్న కాంట్రాక్టు లెక్చరర్లను రెగ్యులర్‌ చేయాలని కడప జిల్లా జేఏసీ చైర్మన్‌ జూటూరు ప్రభాకర్‌ డిమాండ్‌ చేశారు. ఆదివారం కడపలోని ప్రభుత్వ బాలికల జూనియర్‌ కళాశాలలో ఉమ్మడి కడప జిల్లాలోని ప్రభుత్వ కళాశాలల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు లెక్చరర్ల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ లెక్చరర్ల రెగ్యులరైజేషన్‌ కోసం ఎన్నో ఆందోళన కార్యక్రమాలు చేసినా ప్రభుత్వాలు స్పందించ లేదన్నారు. సమావేశం అనంతరం కాంట్రాక్టు లెక్చరర్ల రెగ్యులరైజేషన్‌ కోసం జేఏసీని ఏర్పాటు చేసుకున్నారు. ఇందులో కడప జిల్లా నుంచి రాష్ట్ర జేఏసీ లో రామచంద్రారెడ్డి, మన్సూర్‌ అలీ, చంద్రమోహన్‌రెడ్డిలను ఎన్నుకున్నారు. అలాగే జిల్లా జేఏసీ చైర్మన్‌గా జూటూరు ప్రభాకర్‌ను ఎన్నుకున్నారు. అలాగే జిల్లా కమిటీలో రాయచోటి జోన్‌ నుంచి శివరామిరెడ్డి, ప్రసాద్‌రెడ్డి, రాధాకృష్ణ, ఇమాంషరీఫ్‌, రాజంపేట జోన్‌ నుంచి హనీఫ్‌, సుబ్బయ్య, అమ్మతాదేవి, పులివెందుల జోన్‌ నుంచి రామ్మోహన్‌ రెడ్డి, ఇర్ఫాన్‌, మేడా శ్రీనివాసులు, జమ్మలమడుగు జోన్‌ నుంచి రామాంజనేయులు, బెన్నీ, రామలక్ష్మి, కడప జోన్‌ నుంచి నాగేంద్ర, ఫకృద్దీన్‌, మధు శ్రీనివాస్‌, మల్లేశ్వరి, బద్వేల్‌ జోన్‌ నుంచి రంతుబాషాను ఎన్నుకున్నారు.